అందరి సహకారంతో నాగారం అభివృద్ధి

5వ వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 17: అందరి సహకారంతో నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు ప్రభాకర్ ఎన్‌క్లేవ్, శ్రీనివాస్ నగర్ కాలనీలో రూ. 18 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు, అంతర్గత మురికి కాలువ పనులను ఆదివారం చైర్మన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లావణ్య, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తను వేరు చేయాలి

చౌదరిగూడలో శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్,నవంబర్17: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడ,డాక్టర్స్ కాలనీ,కాకతీయ, వేంకటేశ్వరనగర్,విజయ సాయి,ఎంఎల్ఆర్ కాలనీల్లో ఆదివారం శానిటేషన్ ప్రత్యేక పనులను చైర్మన్ బి.కొండల్‌రెడ్డి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు,సలహాలు అందజేశారు.ప్రజలు తడి,పొడి చెత్తను వేరుచేసి చెత్త వాహనానికి అందజేయాలని సూచించారు.

అన్ని దానాలకన్నా అన్నదానం గొప్పది

నేరేడ్‌మెట్ 17: నేరేడ్‌మెట్ బస్‌స్టాండ్ సమీపంలో శ్రీగంగా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బిర్రు బాల మల్లయ్య ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మెమిన్ భాష ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా రాష్ట్ర చైర్మన్ నారాయణ రెడ్డి, సంఘ సేవకుడు అనిల్ , విజయ, గణేష్, సారిక, బాలు, వెంకట్, అరుణ , ఉపాసన తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మెమిన్ భాష , బాలమల్లయ్య తదితరులు

అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా



చిలుకానగర్‌లో సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి, లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల

ఉప్పల్, నవంబర్ 17: నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చిలుకానగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ హాజరై ఈస్ట్ కళ్యాణపురికాలనీ , బీరప్పగడ్డ ప్రాంతాల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. సీసీ రోడ్డు నిర్మాణంలో భాగంగా సీవరేజీ పనులు చేపడతామన్నారు. వరదనీటి కాలువలు, సీసీ రోడ్లు, నీటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. కాలనీల్లో సమస్యలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టేలా నిధులు తీసుకువస్తున్నామని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రజల కోసం పనిచేయడానికి నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించి పనులు చేపడుతున్నామని చెప్పారు. డివిజన్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు తీసుకువస్తున్నామని కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌పార్టీ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఈస్ట్ కల్యాణపురి కాలనీ అధ్యక్షుడు సతీష్‌కుమార్, నేతలు వీబీ.నరసింహ, కొండల్‌రెడ్డి, జగన్, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, రమేష్, బాలకృష్ణ, బాలు, శ్యామ్, అశోక్‌చారి, గణేష్, నర్సింగ్‌రావు, ఇంద్రసేనారెడ్డి, జంగయ్య, నవీన్, సఫీ ,గౌస్, అనీఫ్, జయమ్మ, రాములమ్మ, రూప, రమ, తదితరులు పాల్గొన్నారు.

కాలనీల సమగ్రాభివృద్ధికి కృషి

చర్లపల్లి: ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కాలనీల సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్‌కు చెందిన వైష్ణవి ఎన్‌క్లేవ్ సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యంగా కాలనీల్లో డ్రైనేజీ సమస్యలతో పాటు రహదారుల నిర్మాణం పనులు చేపడుతున్నామని ఆయన తెలిపారు. వైష్ణవి ఎన్‌క్లేవ్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గంప కృష్ణ, సీసీఎస్ ప్రతినిధి ఎంపెల్లి పద్మారెడ్డి, నాయకులు గంగ ఈశ్వరయ్య, ఆది విష్ణుమూర్తి, సుమంత్, కార్తీక్, సంతోషిరెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారి శంకుస్థాపన

వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేను కలిసిన కాలనీవాసులు

విద్యార్థి దశే భవిష్యత్‌కు పునాది



క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానిస్తున్న కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్ రెడ్డి

మేడ్చల్, నవంబరు 17 : విద్యార్థి దశే భవిష్యత్‌కు పునాది అని, ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ ఏడుకొండలు అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయం, ఆరోగ్యం జీవితంలో ప్రధానమైన అంశాలు అన్నారు. విద్యార్థి దశలోనే ఏదైనా నేర్చుకోగలరని, ఎప్పటికప్పుడు ప్రతిభను పదును పెట్టుకోవాలని సూచించారు. కళాశాల పూర్వ విద్యార్థి, వర్ధమాన నటి అస్మిత నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఆసక్తి ఉన్న రంగంపై దృష్టి సారిస్తే భవిష్యత్‌తో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్ బాబు, ప్రిన్సిపాల్ లోకనాథం, డీన్ వెంకట్రావు, సాక్ కన్వీనర్ శైలజారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'వాసవీ' కార్యవర్గం ఎన్నిక

బోడుప్పల్, నవంబర్17: బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని వాసవీనగర్ కాలనీ వెల్ఫేరే అసోసియేషన్ నూతన కమిటీని కాలనీవాసులు ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మోహన్‌బాబు, ఉపాధ్యక్షులుగా కిశోర్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా క్రాంతికుమార్, కోశాధికారిగా సాయిగణేష్, కల్చరల్ ఆర్గనేజింగ్ సెక్రటరీలుగా సందీప్‌శర్మ, సంతోషిరెడ్డి, లీగల్, మీడియా అడ్వజర్స్‌గా మహేశ్, వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.

శిల్పారామంలో నృత్యప్రదర్శనలు

ఉప్పల్, నవంబర్ 17: ఉప్పల్ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహగణపతితమ్, చంద్రచూడా, ఆనంద తాండవం, గంధం పూయరుగా, అష్టపది, రాసలీల, సరస్వతి స్థుతి, శివస్తుతి, అన్నమాచార్య కీర్తన, లక్ష్మిస్తుతి, తిల్లాన, గణేశా తాండవం, శాస్త్రీయ నృత్యాలు, నాసపల్లే, మళ్లతోట, కాళ్ల గజ్జెలు, గల్ గల్ సప్పుల్లా అనే అంశాలలో ఆదివారం జానపద, కూచిపూడి నృత్యాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మోక్షిత్, కృతిక, ఆకాంక్ష, వింధ్య, సాత్విక, సాన్విక, అధ్య, చైత్రిక, స్ఫూర్తి, కీర్తన, అనన్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చర్లపల్లి, నవంబర్ 17: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. డివిజన్ పరిధి సోనియగాంధీనగర్‌లో నివాసముండే డేవిడ్(41) ఈనెల 14న ఇంటి నుంచి బయలుదేరి చక్రీపురం నుంచి చర్లపల్లి వైపుకు నడుచుకుంటూ వెళుతుండగా ఓ బాలుడు తన బైక్‌పై వచ్చి డేవిడ్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలకు గురైన డేవిడ్‌ను వాహనాదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించి మెరుగైన వైద్య చికిత్స కోసం దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులతో కిటకిటలాడిన కీసరగుట్ట

- స్వామి వారిని దర్శించుకున్న భక్తులు
- కార్తీక దీపాలు, శివలింగాలకు పూజలు
- భక్తులతో నిండిన క్యూలైన్లు
- చీర్యాల్‌లో సామూహిక వ్రతాలు

కీసరగుట్టలో కార్తీకదీపాలను వెలిగిస్తున్న భక్తజనం

కీసర, నవంబర్ 17: కార్తీక మాసం, ఆదివారం సెలవుదినం కావడంతో కీసరగుట్ట పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము 3 గంటల నుంచే స్వామివారికి గర్భాలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. శివనామస్మరణతో ఆలయం మారుమోగింది. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాల్లో కార్తీకదీపాలను వెలిగించారు. క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. అనంతరం కాశీవిశ్వేశ్వరాలయం, శ్రీ లక్ష్మీనర్సింహస్వామివారిని, శ్రీ నాగదేవతలను భక్తులు దర్శించుకున్నారు.

స్వామి సేవలో కుషాయిగూడ కోర్టు జడ్జి

కుషాయిగూడ కోర్టు జడ్జి రఘునాథ్‌రెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. జడ్జి రఘునాథ్‌రెడ్డికి ఆలయం తరుపున పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. స్వామివారికి ఆయన ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం ఈఓ సుధాకర్‌రెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి వేదపండితుల చేత ఆశీర్వచనం చేయించారు.

శివలింగాలకు భక్తుల అభిషేకాలు

కీసరగుట్ట పరిసర ప్రాంతాల్లో ఉన్న శివలింగాలకు పాలు, తేనె, ఆవుపాలు, నెయ్యిలతో భక్తులు అభిషేకాలను నిర్వహించారు. అనంతరం కార్తీకదీపాలను వెలిగించి మొక్కులను తీర్చుకున్నారు.

చీర్యాల్‌లో భక్తుల సందడి

కీసరగుట్టలో స్వామివారికి గర్భాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు

కార్తీకమాసం కావడంతో చీర్యాల్ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం భక్తుల సందడి నెలకొంది.భక్తులు స్వామివారి సన్నిధానంలో సత్యనారాయణ వ్రతాలునిర్వహించారు. ఆర్టీసీ ఈ ఆలయానికి ఆర్టీసీ బస్సులను వేయడంతో చాలామంది భక్తులు నగర ప్రాంతాల నుంచి వచ్చి స్వామివారిని దర్శించుకొన్నారు. చీర్యాల్ శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం ఆవరణలో శ్రీ ధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులకు ఉచితంగా అన్నదానం చేశారు.



చీర్యాల్ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాలు

కీసరగుట్టలో స్వామవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్లు ఏర్పాటు చేయాలి

మల్కాజిగిరి, నవంబర్ 17: ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్లు ఏర్పాటు చేయాలని డివిజన్ కార్పొరేటర్ శ్రావణ్ అన్నారు. ఆదివారం రైల్వే అధికారులతో కలిసి ఆనంద్‌బాగ్, సర్దార్ పటేల్‌నగర్‌లో ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్లను ఏర్పాటుకు రైల్వే అధికారులతో కలిసి స్థలాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రావణ్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా లోకల్ రైల్వే స్టేషన్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్‌లో ఘట్‌కేసర్ నుంచి లింగంపల్లి వరకు లోకల్ రైలు నడపడం హర్షణీయమన్నారు. అయితే రైల్వే ప్రయాణికులకు అనుకూలంగా ఆనంద్‌బాగ్, సర్దార్ పటేల్‌నగర్‌లో రైల్వే స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏడీఈ ఎస్ శ్రీధర్, రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, సుబ్బారావు, రవి, సాయి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అధికారులతో కలిసి రైల్వే స్టేషన్ల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రావణ్

సజావుగా గ్రూప్ 3 పరీక్షలు

అంకుషాపూర్‌లోని ఏసీ ఇంజినీరింగ్ కళాశాల వద్ద భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీసీపీ అరవింద్ తదితరులు

అల్వాల్‌లోని గ్రూప్ 3 పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 17: గ్రూప్-3 పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం అల్వాల్‌లోని శ్రీచైత్య జూనియర్ కాలేజీ, ఆదర్శ్ జూనియర్ కాలేజీ గ్రూప్ -3 పరీక్ష కేంద్రాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు.

కీసర: మండలంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఉదయం 8.30గంటలలోపే అభ్యర్థులను అనుమతించారు. పోలీసు బందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహించారు.

ఘట్‌కేసర్: పోచారం పోలీస్టేషన్ పరిధిలో శ్రీనిధి,నల్ల నర్సింహా రెడ్డి,అనురాగ్,ప్రిస్టన్ ఇంజినీరింగ్ కళాశాల్లో మొత్తం 3,600 మంది అభ్యర్థులు గ్రూప్-3 పరీక్ష రాశారు.పరీక్షా కేంద్రాలను క్రైం డీసీపీ అరవింద్ బాబు,ఏసీపీ చక్రపాణి,సీఐ రాజువర్మ పరిశీలించారు.

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన గ్రూప్-3 పరీక్షలు భారీ పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా జరిగాయి. కొండాపూర్‌లోని సంస్కృతి ఇంజినీరింగ్,విజ్ఞాన్ మహిళా, అవుషాపూర్‌లోని విజ్ఞాన భారతి,ఏసీ, అరోరా,ఎదులాబాద్‌లోని మెగా,ఘనపూర్‌లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గ్రూప్-3 పరీక్షలు జరిగాయి. మొత్తం 6418 మంది అభ్యర్థులకు గాను 3636 మంది పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. మల్కాజిగిరి సీసీఎస్ డీసీపీ అరవింద్, ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్ పరశురాం భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

మేడ్చల్: గ్రూప్-3 పరీక్ష రాయడానికి అభ్యర్థులు అనాసక్తిని ప్రదర్శించారు.మేడ్చల్, పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గ్రూప్-3 పరీక్షలకు అతి తక్కువ మంది హాజరయ్యారు. హాజరైన వారి కంటే గైర్హాజరైన వారి సంఖ్యే ఎక్కువ ఉంది. 25 శాతంలోపు మాత్రమే అభ్యర్థులు హాజరయ్యారు. రెండు పోలీస్‌స్టేషన్ పరధిలో ఉన్న 21 సెంటర్లను హాజరు శాతాన్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. ఆయా సెంటర్ల పరిధిలో 12,867 మంది అభ్యర్థులకు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేయగా కేవలం 2951 హాజరు కావడం గమనార్హం. ఇది 22.95 శాతంగా నమోదైంది. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రూప్-3 పరీక్ష నిర్వహణ కేంద్రాలను భద్రతను ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ సత్యనారాయణ పర్యవేక్షించారు.

ఎన్ఎస్ఆర్ కళాశాలలో తప్పిదం

పరీక్ష నిర్వహణలో మేడ్చల్ పట్టణంలోని 5413-ఎన్ఎస్ఆర్ కేంద్రంలో తప్పిదం జరిగింది. పరీక్ష మొదటి పేపరులో తెలుగు-ఇంగ్లిష్ పేపర్‌కు బదులు ఉర్దూ-ఇంగ్లిష్ రావడంతో అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నిర్వహణ అధికారులు వెంటనే తేరుకొని పేపరు మార్చి ఇచ్చారు. పేపరు మార్చిడిలో జరిగిన ఆలస్యానికి పరిహారంగా ఈ కేంద్రంలో అభ్యర్థులు ఆరు నిమిషాలు అధికంగా కేటాయించారు.

మైసమ్మగూడలోని గందరగోళం

గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలల్లో పలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఒకే ప్రాంతంలోఅన్ని కళాశాలలు ఒకే పేరుతో మీద ఉండటంతో అభ్యర్థులు ఏ కళాశాలకు వెళ్లాలో అర్థం కాక ఇబ్బంది పడ్డారు. ఆ కేంద్రానికి, ఈ కేంద్రానికి పరుగులు పెట్టారు. దీంతో కొంత మంది అభ్యర్థులు నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోలేక పోయారు. పరీక్ష కేంద్రానికి వెళ్లడానికి ఇబ్బందిపడుతున్న నలుగురు అభ్యర్థులను బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గొట్టుముక్కుల సత్యనారాయణ రాజు, ఆయన స్నేహితుడు పృథ్వీ గుర్తించి, తమ బైక్‌లపై పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే నిర్ణీత సమయం ముగిసిపోయిందని అభ్యర్థులనులోనికి అనుమతించ లేదు.

మేడ్చల్‌లో పరీక్షా కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలనకు వచ్చిన ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ సత్యనారాయణ

అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద పోలీసులు బందోబస్తు

నేడు విద్యుత్ సరఫరా బంద్

కాప్రా/మల్లాపూర్, నవంబర్ 17: మౌలాలి సబ్‌స్టేషన్ కృష్ణానగర్ 33/11మల్లాపూర్ ఫీడర్‌పరిధిలోని కృష్ణానగర్ రోడ్‌నంబర్‌లు 8,9,10,11, మోడీ అపార్ట్‌మెంట్ల పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని మౌలాలి సబ్‌స్టేషన్ ఏఈ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

జవహర్‌నగర్ పరిధిలో..

జవహర్‌నగర్: 11కేవీ మహంకాళీ ఫీడర్‌లో శ్రీరామ్‌నగర్, మున్సిపల్ ఆఫీస్, జ్యోతికాలనీ, బజరంగ్ నగర్, లివీస్ ఎన్‌క్లేవ్, సీపీఐకాలనీ, లక్ష్మీనగర్, రిజిస్ట్రేషన్‌కాలనీ, రావినారాయణరెడ్డికాలనీ ప్రాంతాల్లో సోమవారం ఉద యం 11 నుంచి 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బాలాజీనగర్ విద్యుత్ ఏఈ సాంబశివరావ్ తెలిపారు.

నాగారంలో..

మేడ్చల్ కలెక్టరేట్: నాగారం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ సత్యనారాయణ కాలనీ ఫీడర్ పరిధిలోని సాయి సంజీవ ఎన్‌క్లేవ్, మాదిరెడ్డి మల్లారెడ్డి కాలనీ, గాంధీనగర్, రవీంద్రనగర్, గోపి కృష్ణ కాలనీ, సాయి సంజీవ నగర్, అరవిందనగర్, మణి ఎన్‌క్లేవ్, ఎస్ఎల్ఎన్ కాలనీ, తివారీ ఎన్‌క్లేవ్, జీఎస్ఆర్ గార్డెన్, హనుమాన్ నగర్ కాలనీల్లో సోమవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సెక్షన్ విద్యుత్ ఏఈ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

ఉప్పల్ పరిధిలో..

ఉప్పల్: హబ్సిగూడ సెక్షన్ పరిధిలోని భవానీనగర్ స్ట్రీట్ నం 1, 2, 3, వీఎస్‌టీకాలనీ, శ్రీనగర్‌కాలనీ, హెచ్ఎంటీనగర్ స్ట్రీట్ నం 1, రాజీవ్‌నగర్ నాచారం ప్రాంతాల్లో సోమవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ ఉండదని హబ్సిగూడ ఏఈ వి.గణేశ్ తెలిపారు. అదేవిధంగా రామంతాపూర్ పరిధిలోని గణేష్‌నగర్, గోఖేలేనగర్, న్యూగణేష్‌నగర్, పాశంసత్తయ్య కాలనీ, రామంతాపూర్, రామంతాపూర్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏఈ కె.లావణ్య తెలిపారు.

శామీర్‌పేట మండలంలో..

మేడ్చల్: శామీర్‌పేట మండలంలోని దేవరయాంజాల్, తూంకుంట 11కేవీ ఫీడర్ల పరిధిలో సోమవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శామీర్‌పేట, మోదీ బిల్డర్స్, పారిజాత హోమ్స్, యూఎస్ఎం మై సిటీ, ఓఆర్ఆర్ టోల్ గేట్, సెలబ్రటీ, మహిళా డిగ్రీ కళాశాల ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాఘవేందర్ రావు పేర్కొన్నారు.

ఘట్‌కేసర్ సబ్ స్టేషన్ పరిధిలో

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ పట్టణంలోని బాలాజీనగర్, గాంధీనగర్, గీతామందిర్, ఇడబ్ల్యూఎస్ కాలనీ, కేశవనగర్, గుంటిగూడెం, ద్వారకానగర్‌లలో సోమవారం ఉదయం 11నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ బీ బలరాం చెప్పారు.

మేడ్చల్ : ఆలియాబాద్ గ్రామంలోని శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఉప్పల్‌లో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

సిటీబ్యూరో, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): క్రీడా పోటీలు విద్యార్థులలో మనోస్థైర్యాన్ని పెంపొందించడంతో పాటు ఈ పోటీ ప్రపంచంలో ఉన్నత స్థానాన్ని చేరేందుకు తోడ్పడుతాయని తైక్వాండో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సుధీర్, కార్యదర్శి శివకుమార్ అన్నారు. ఉప్పల్‌లో ఆదివారం లక్ష్మారెడ్డి కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 165 మంది బాల బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి బంగారు, వెండి, రజిత పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాలనీ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కార్యదర్శి ప్రేమ్‌కుమార్, కేవీ స్కూల్ స్పోర్ట్స్ ఇన్‌చార్జి సూర్యప్రకాశ్, తైక్వాండో కోచ్‌లు పృథ్వి, భాస్కర్, సాయి, యశ్వంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరికోత మిషన్లకు ఫుల్ గిరాకీ

కీసర, నవంబర్ 17: వరికోత మిషన్లకు ఫుల్ డిమాండ్ పెరిగిపోయింది. ఈ సంవత్సరం భారీగా మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటను సాగుచేశారు. ఒకేసారి అన్ని గ్రామాల్లో వరి పంట కోతకు రావడంతో కూలీలు దొరక్క పోవడంతో వరికోత మిషన్‌కు ఫుల్ డిమాండ్ పెరిగిపోయింది. చేతి కొచ్చిన పంటలను కోయించుకోవడానికి రైతులు నానా తిప్పలు పడుతున్నారు. ఒకేసారి రైతులు సాగుచేసిన పంటలన్నీ కోతకు రావడంతో చాలా మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో మిషన్ వెంట సుమారు 10 మంది రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు కాపు కాస్తున్నారు. వరి కోస్తే ఒక గంటకు రూ.3200 తీసుకుంటున్నారు. వంద రూపాయలు ఎక్కువైనా సరే మా పొలాన్ని ముందుకోయండి అంటూ రైతులు పోటీపడుతున్నారు.

వరిని కోస్తున్న హార్వేస్టర్